సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత బుధవారం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. వార్డు పరిధి రామకృష్ణాపురంలో కొన్ని రోడ్లు, ధారపాలెం బంగారమ్మ లేవుట్‌లోని రోడ్లు, పైనాపిల్‌కాలనీ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో రక్షణ గోడ, శ్రీకృష్ణాపురం శ్మశాన వాటిక గోడ ఎత్తు పెంపుతో పాటు ఆరిలోవ కాలనీలో పలుచోట్ల కాలువలు, రోడ్లు, సామాజిక భవనాలు, కొండవాలు ప్రాంతంలో ఎదురవుతున్న నీటి కొరత తదితర సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో ఆమె పేర్కొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు సమస్య వివరిస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

మద్దిలపాలెం: వైద్య, ఆరోగ్యశాఖలో 22 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్లను తొలగించారని, వారిని తిరిగి ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును హెల్త్ అసిస్టెంట్లు కోరారు. ఈమేరకు ఆయనను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 22 ఏళ్లుగా హెల్త్ అసిస్టెంట్లుగా విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహించామన్నారు. ఎలాంటి ముందస్తు ఉత్తర్వులు లేకుండా కోర్టు తీర్పును ఆసరాగా చేసుకుని నిర్దాక్షిణ్యంగా విధుల నుండి తొలంగించారన్నారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఓఎస్‌డీతో మాట్లాడారు. కోర్టు కేసు కారణంగా తొలగించారని, దీనిపై ప్రభుత్వంతో చర్చించి అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నిరాశ్రయ వసతి గృహానికి వృద్ధురాలి తరలింపు



వసతి గృహ నిర్వాహకులకు వృద్ధురాలిని అప్పగిస్తున్న ఎస్‌ఐ సురేష్ కుమార్

బీచ్‌రోడ్డు: అరవై ఏళ్ల వృద్ధురాలిని ఎవరో బీచ్ రోడ్డులో వదిలి వెళ్లటంతో ఆమెను జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహానికి తరలించారు. మూడో పట్టణ ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీచ్‌రోడ్డులో ఉన్న వృద్ధురాలిని స్థానికులు చూసి పోలీస్ కమిషనరేట్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి తమకు సమాచారం రావటంతో బీచ్‌రోడ్డుకు చేరుకుని వృద్ధురాలిని గుర్తించామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. వివరాలు అడగ్గా పేరు దౌలి అని, ఊరు కలకత్తా అని చెప్పినట్లు తెలిపారు. ఆమెను జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహానికి తరలించినట్లు పేర్కొన్నారు.

రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ఆరిలోవ: కైలాసగిరి రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక బుధవారం విశాలాక్షినగర్ పోలీస్ కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ ఎన్నికలో అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.సత్యనారాయణ, అడ్వైజర్‌గా జి.మురళీధర్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఆర్.వి రమణతో పాటు మరో ఆరుగురిని ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
✆ 7331119904, 9912440606

అడ్డగోలు పార్కింగ్‌తో.. అవస్థలు



పిఠాపురంకాలనీలో పార్కింగ్ చేసిన వాహనాలు

- రాకపోకలకు కాలనీవాసుల ఇబ్బందులు
- రాత్రి వేళల్లో ఆకతాయిల ఆగడాలు
- మందుబాబుల చిందులు
- పట్టించుకుని ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం: మెయిన్ రోడ్ల పైనే వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. కాలనీల్లో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడ అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలను **ఈ విధంగా** ఎలాంటి అనుమతులు లేకుండా పార్కింగ్ చేయడంతో ఆ వాహనాలు రాత్రి వేళ్లలో ఆకతాయిల అడ్డాగా మారుతున్నాయి. చీకడి పడితే ఆ రోడ్ల గుండా ఒంటరిగా వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తుంది. పార్కింగ్ చేసిన వాహనాల మాటున మందుబాబులు చిందులు వేస్తున్నారు. అటుగా వెళ్లే వారితో వాగ్వాదాలకు దిగుతున్నారు. ముఖ్యంగా కాలనీ రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయడంతోనే ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇక్కడా అక్కడా అనే తేడా లేకుండా ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ వాహనాలు పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు.



హెచ్‌బీకాలనీ మెయిన్‌రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు..

పిఠాపురం కాలనీలో కూరగాయల మార్కెట్ నుంచి మలేరియా కార్యాలయం వరకు గల సరీ్వసు రోడ్డులో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ లారీలు, ప్రైవేట్ బస్సులు, ఏటీఎం క్యాష్ ఫిల్లింగ్ వాహనాలు, ఆటోలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. వీటితో పాటు ఇదే రోడ్డులో గల ఒక పార్శిల్ సర్వీసు కంపెనీకి చెందిన భారీ లారీలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో సర్వీసు రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వాహన చోదకులకు ఎన్నిసార్లు పార్కింగ్ చేయొద్దని చెప్పినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. దీనిపై ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి సర్వీసు రోడ్లపై వాహనాల పార్కింగ్‌ను అరికట్టాలని కోరుతున్నారు.

హెచ్‌బీకాలనీ మెయిన్‌రోడ్డుపై..

హెచ్‌బీకాలనీ నుంచి వెంకోజీపాలెం వెళ్లే ప్రధాన రహదారిపై ఎక్కడికక్కడ ప్రైవేట్ వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. టాటా వ్యాన్‌లు, ఆటోలు ఇక్కడ పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహన చోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు. అక్రమ పార్కింగ్ చేస్తున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్డులో..

పిఠాపురంకాలనీ కూరగాయల మార్కెట్ నుంచి ఇటు ఎమ్మెల్సీ మాధవ్ ఇంటికి వచ్చే సర్వీసు రోడ్డు ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయింది. ఈ రోడ్డుపై కూరగాయల మార్కెట్ చివరి వరకూ వాహనాలు నిలిపేసి అక్రమంగా పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. దీంతో పిఠాపురం కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



సమీక్షిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: సేవా కార్యక్రమాల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ముందుండాలని ఏయూ వైస్ ఛాన్సలర్ జి. శశిభూషణరావు అన్నారు. బుధవారం నిర్వహించిన వర్సిటీ జాతీయ సేవాపథక వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. సమావేశంలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారిపై దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

బీచ్‌రోడ్డు: ఫుట్‌పాత్‌పై చిరు వ్యాపారం చేసుకుంటున్న వ్యక్తిపై దాడి చేసిన ఐదుగురు వ్యక్తులను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సిరిపురంలో ఫుట్‌పాత్‌పై బట్టలు వ్యాపారం చేసుకుంటున్న వెంకటరావు వద్దకు ఐదుగురు వ్యక్తులు కారులో వచ్చి 8 టీ షార్టులు తీసుకున్నారు. డబ్బులు ఇవ్వకుండా కారు ఎక్కిన వారిని వెంకటరావు డబ్బులు అడిగాడు. వారు కారు దిగి వచ్చి వెంకటరావుపై దాడి చేశారు. వెంకటరావు వెంటనే 100 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయగా క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి సీసీ ఫుటేజ్ ద్వారా ఐదురుగు వ్యక్తులను గుర్తించి అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మిద్దె పంటలతో ఆరోగ్యకర ఆహారం



పలు రకాల ఆకుకూరలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఎంవీపీకాలనీ: మిద్దె పంటల ఉత్పత్తి, వినయోగంతోనే ఆరోగ్యకరమైన ఆహారం సాకారమవుతుందని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని స్కూల్ ఆవరణలో యాజమాన్యం, వ్యాస్ ఎన్జీవో సంయుక్త ఆధ్వర్యంలో కూరగాయల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, వ్యాస్ కో–ఆర్డినేటర్ రాజేశ్వరి తదితరులు పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పలు రకాల కూరగాయలు, ఆకు కూరలను ప్రదర్శిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటల వినియోగంతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. అర్బన్ ప్రాంతం అధికంగా ఉన్న విశాఖలో మిద్దె పంటలపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించి ఆయా ఉత్పత్తులను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న మువ్వల సురేష్

బీచ్‌రోడ్డు: ఇటీవల అకాల మరణం పొందిన సురేష్ జ్ఞాపకార్థం బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. చిన్నవాల్తేరు, పెద్దవాల్తేరుకు చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మువ్వల సురేష్ పాల్గొని రక్తదానం చేశారు. శిబిరం ముగిసే సమయానికి 75 యూనిట్ల రక్తం సేకరించారు.

జనారణ్యంలోకి కొండ గొర్రె



స్థానికులు పట్టుకున్న కొండ గొర్రె

ఆరిలోవ: స్థానికంగా జనారణ్యంలోకి వచ్చిన ఓ కొండగొర్రె స్థానికులకు పట్టుబడింది. ఇక్కడ కంబాలకొండల వెనుక నుంచి బుధవారం ఉదయం దారి తప్పిన కొండగొర్రె ఆరిలోవ కాలనీ కొండ అంచున ఉన్న గెడ్డలోకి దూకింది. నివాసాల మధ్యలో ఉన్న ఆ గెడ్డలో కొండగొర్రెను స్థానికులు చూసి ఏదో జంతువు అనుకుని పెద్దగా కేకలు వేశారు. దీంతో బెదిరిపోయి భయంతో గెడ్డలోనే ఆ కొండగొర్రె పరుగులు తీసింది. దుర్గాబజార్ మీదుగా లక్ష్మీనగర్ వరకు పరుగులు తీస్తూ చివరికి అక్కడ స్థానికులకు చిక్కింది. గెడ్డలో పరిగెత్తడంతో కాళ్లు, తలకు గాయాలయ్యాయి. స్థానికులు దానిపై జాలి చూపించారు. గాయాలైన కాళ్లు, తలకు పసుపు రాసి గుడ్డతో కట్టుకట్టారు. అనంతరం అందుబాటులో ఉన్న సచివాలయ సిబ్బందికి అప్పగించారు. వారు అందించిన సమాచారంతో అటవీశాఖ అధికారులు సిబ్బందితో అక్కడికి చేరుకుని కొండగొర్రెను స్వాధీనం చేసుకొన్నారు. దానికి వైద్యం అందించి అడవుల్లో విడిచిపెడతామని తెలిపారు.

లా కాలేజీలో భాషా ఉత్సవ్

విశాఖ విద్య: ఏయూలోని లా కాలేజీలో బుధవారం భారతీయ భాషా ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి చొరవ తీసుకున్నారు. ప్రొఫెసర్లు ఎన్.బి. చంద్రకళ, జి.రాఘవయ్య, ఎ.పద్మావతి, టి.నాగభూషణం, డాక్టర్ ఎల్.వి.కె.ప్రసాద్, డాక్టర్ ఆర్. వరప్రసాద్, డాక్టర్ కె.జగదీశ్వరరావు, డాక్టర్ డి.సుశీలతో పాటు లా కాలేజీ విద్యార్థులు, సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. డిజిటల్ స్పేస్‌లలో భారతీయ భాషలను ప్రోత్సహించడం, భారతీయ భాషల ద్వారా ఆవిష్కరణలు, పరిశోధనలను ప్రోత్సహించడం కోసం ఇలాంటి ఉత్సవాలు ఎంతో దోహదపడతాయని ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం అన్నారు. బహుభాషా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు, పాటలు, ఆటలు, వినోద కార్యక్రమాలు, పొడుపు కథల వంటి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు డిబేట్లు, సెమినార్లు నిర్వహించారు.

పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో నిర్వాహకులు, నిపుణులు

విశాఖ విద్య: పరిశోధనలపై మరింత అవగాహన పెంచుకోవాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ సూచించారు. ఐఐపీఈలో 'తుప్పు నివారణ వ్యూహాలు'పై మూడు రోజులు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిపుణులు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు ప్రసంగించారు. ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ తుప్పుకు సంబంధించిన పారిశ్రామిక సవాళ్లను ఎదుర్కోవడంలో ఇన్‌స్టిట్యూట్‌లో కొనసాగుతున్న ప్రయత్నాలను వివరించారు. వర్క్‌షాప్ వాస్తవ ప్రపంచ పారిశ్రామిక సమస్యలకు వర్తించే కార్యాచరణ పరిష్కారాల అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని, పరిశోధన సాంకేతికతను అభివృద్ధి చేయడంలో నిబద్ధతను బలోపేతం చేస్తుందన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ దీపాంకర్ పాల్ మాట్లాడుతూ విద్యా పరిశోధన, పారిశ్రామిక పద్ధతుల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేది, డీన్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత సారం అందరూ తెలుసుకోవాలి

- త్రిదండి చిన జీయర్ స్వామి
- అంబరాన్ని తాకిన గీతా జయంతి ఉత్సవం



పాల్గొన్న భక్తులు



ప్రసంగిస్తున్న చిన జీయర్ స్వామి

బీచ్‌రోడ్డు: భగవద్గీత పుస్తకం కాదు.. అందులోని శ్లోకాలు ఎంతో శక్తివంతమైనవని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి తెలిపారు. బుధవారం గురజాడ కళాక్షేత్రంలో సాగర్‌నగర్ ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ సారధ్యంలో గీతాజయంతి ఉత్సవం మంగళ ధ్వని వేద మంత్రాలతో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి వెలిగించి గీతా జయంతి ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన కార్యక్రమానికి విచ్చేసిన అశేష భక్త జన వాహినిని ఉద్దేశించి ప్రసంగించారు. భగవద్గీతకు మనం భక్తితో నమస్కారం చేస్తే పరిపూర్ణమైన అనుగ్రహం కలుగుతుందన్నారు. మన ఆధ్యాత్మిక సాంప్రదాయంలో గ్రంథాలకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని, వాటి ద్వారా ప్రతి ఒక్కరికి జ్ఞానం కలుగుతుందన్నారు. మనుష్య జన్మ పొందిన ప్రతి ఒక్కరూ భగవద్గీతలో గల సారాంశాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి అన్నారు. గమ్యం ఏమిటో తెలియని ఈ జీవితానికి చక్కని పరిష్కార మార్గాన్ని చూపి తద్వారా భక్తిని, మానసిక ప్రశాంతతని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగిస్తుందని అన్నారు. ముఖ్యంగా నేటి తరం యువత వ్యసనాల బారిన పడకుండా ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ భగవద్గీతను అనుసరిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. తారాస్థాయిలో శ్రీ గీతా జయంతి ఉత్సవాన్ని నిర్వహించిన ఇస్కాన్ ప్రతినిధులకు మంగళా శాసనముల కృపచేశారు. వీరితో పాటు ఇస్కాన్ విశ్వస్థాయి ప్రతినిధులు గురుప్రసాద్ స్వామి మహారాజ్, భీమాప్రభు, ఇస్కాన్ విశాఖ శాఖ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయ్ సేవిని తదితరులు ప్రసంగించారు. తదుపరి లక్ష భగవద్గీత పుస్తకాల వితరణలో భాగంగా చిన జీయర్ స్వామి చేతుల మీదుగా విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు అందజేశారు. ముందుగా నగరానికి చెందిన వివిధ ఆధ్యాత్మిక సంస్థలచే సామూహికంగా శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ, శ్రీ గీతా ప్రచార సమితి సభ్యులచే సంపూర్ణ గీతాపారాయణ, గీతా యజ్ఞం, గీతాహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. విచ్చేసిన భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఈవో వి. త్రినాథరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, వంశీ ప్రభు, స్వరూప్ ప్రభు, వారిజ ఆశ్రమ కమిటీ సభ్యులు, ఇస్కాన్ జీవితకాల సభ్యులు, వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే అవినీతిరహిత సమాజం

ఆరిలోవ : ప్రతి ఒక్కరూ చేసే పనిని దేశానికి అంకితం చేయగలిగేలా ఉండాలని ఇంటర్నేషనల్ మోటివేషనల్ టీచర్ అజిత్‌కుమార్ సూచించారు. శ్రీకృష్ణాపురం గురుకులాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపావతి ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ – 2047 అవగాహన సభలో మాట్లాడారు. విద్య, వ్యాపారం, క్రీడలు తదితర అంశాలు గురించి వివరించారు. ఆయా రంగాల్లో రాణించి అద్భుతాలు సృష్టించిన వ్యక్తులు దేశానికి ఎలాంటి సేవలు అందిస్తున్నారో తెలియజేశారు. శాస్త్రవేత్తలు ఏ విధంగా దేశానికి మంచి పేరు తీసుకొచ్చారో వివరించారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు 2047 నాటికి దేశానికి అంకితం చేసే సేవలో నిలవగలగాలని సూచించారు. ప్రతి పని చేయడానికి లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ లక్ష్యాన్ని సాధించడానికి క్రమశిక్షణ, పట్టుదల, కృషి, దీక్ష, ఏకాగ్రత కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం సమాజం అవినీతితో ఉందని, అవినీతి లేని సమాజాన్ని నిర్మించే సత్తా యువతకు మాత్రమే ఉందన్నారు. ఉపాధ్యాయులు రాజ్యాంగంలోని అంశాలను విద్యార్థులకు వివరించాలని సూచించారు. దేశంలో 15 సంవత్సరాల నుంచి పేద యువతే క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

బీచ్‌రోడ్డు: గుర్తు తెలియని మృతదేహాన్ని ఆర్కే బీచ్‌లో స్థానికులు గుర్తించారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం తెల్లవారు జామున వాకింగ్ చేస్తున్న స్థానికులు ఆర్కే బీచ్ వద్ద ఉన్న ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని చూశారు. వారిచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పోషకాహారంతో చర్మ సౌందర్యం

ఏయూక్యాంపస్: పోషకాహారం తీసుకుంటూ తగిన వ్యాయామం చేస్తే చర్మసౌందర్యం మెరుగవుతుందని ఫిట్‌నెస్ కోచ్ యాస్మిన్ కరాచీవాలా తెలిపారు. ఒక హోటల్లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ భోజనం మానేయడం, క్రాష్ డైటింగ్ చేయకూడదన్నారు. అవసరమైన పోషకాలతో కూడిన సమతుల ఆహారం, కాలిఫోర్నియా బాదం గింజలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. విటమిన్ ఇ, మెగ్నీషియం, ప్రొటీన్, రిబోఫ్లావిన్, జింగ్ వంటి పోషకాలు సమృద్ధిగా బాదంలో లభిస్తాయన్నారు. కాలిఫోర్నియా బాదంలో ప్రొటీన్లు అధికంగా ఉంటాయన్నారు. రోజు చేసే వ్యాయామాలు, శరీరానికి తగినంత నీరు తీసుకోవడం, యోగా చేయడం, పోషకాహారం తీసుకోవడం వంటివి చర్మ సౌందర్యాన్ని పెంపొందిస్తాయన్నారు.

ముగిసిన గీతా జయంతి ఉత్సవాలు



ఉత్కళ్ సమాజంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బీచ్‌రోడ్డు: సిరిపురం ఉత్కళ్ సమాజ్ దేవాలయ ప్రాంగణంలో శ్రీ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ గీతా జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా శ్రీ గీతా ప్రచార సమితి సభ్యులచే సామూహికంగా సంపూర్ణ గీతా పారాయణ, గీతా హోమం నిర్వహించారు. అనంతరం గీతా జయంతి ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదాలు వితరణ చేశారు. ఆధ్యాత్మిక భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి. జగన్‌మోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి ఎం. వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి. లక్ష్మీనరసింహ, ఎస్. వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో విద్యార్థుల సందడి



ఉత్సవాలకు హాజరైన విద్యార్థులు

విశాఖ విద్య : ఆంధ్ర యూనివర్సిటీలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవంగా ఘనంగా ముగిసింది. వివిధ కాలేజీల విద్యార్థులు వందలాదిగా తరలివచ్చి తమ స్నేహభావాన్ని చాటుకున్నారు. యూనివర్సిటీ ఓపెన్ ఆడిటోరియం విద్యార్థుల ఆటపాటలతో హోరెత్తింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమెన్స్ హాస్టల్ చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ ఎ.పల్లవి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వర్సిటీలో చదువుకునే విద్యార్థులందరినీ ఒకే వేదిక మీదకు తీసుకొచ్చి, వారిలో స్నేహభావాన్ని పెంపొందించేలా కార్యక్రమం నిర్వహించారన్నారు. చదువులతోపాటు, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికి తీసేందుకు ఇలాంటివి ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.విజయ మోహన్ మాట్లాడుతూ ఇలాంటి ఫెస్టివల్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఉద్యమాలతోపాటు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సదస్సుకు హాజరవ్వాలి

ఆరిలోవ : ఈ నెల 14, 15న విజయవాడలో నిర్వహించనున్న ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర స్థాయి సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. విజయవాడలో మొదటి రోజు సదస్సు సిద్దార్థ అకాడమీ, రెండో రోజు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భవనంలో నిర్వహిస్తామన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిశోర్ మక్వానా, సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామ్ ప్రసాద్‌తోపాటు రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొని హక్కులు, ఆశయాలను వివరిస్తారని తెలిపారు.

కొత్త భవనం నుంచి విధులు ప్రారంభం



ఆరిలోవ పోలీస్ స్టేషన్ కొత్త భవనంలో సీఐ మల్లేశ్వరరావు, సిబ్బంది

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ సిబ్బంది కొత్త భవనం నుంచి బుధవారం విధులు ప్రారంభించారు. విమ్స్ ఆవరణలో నిర్మించిన కొత్త పోలీస్ స్టేషన్ ఈ నెల 8న ప్రారంభమైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఫైళ్లు, అవసరమైన సామగ్రి, ఫర్నీచర్‌ను తరలించి పాత భవనాన్ని ఖాళీ చేశారు. ప్రస్తుతం కొత్త భవనం వినియోగిస్తున్నారు. సీఐతో పాటు ఎస్‌ఐలు, సిబ్బంది అంతా అక్కడకు తరలిపోయారు. అర్చకులతో ప్రత్యేకంగా పూజలు చేయించారు. అనంతరం విశాలమైన భవనంలో సీఐ, ఎస్‌ఐలు ఎవరి చాంబర్‌లో వారు బాధ్యతల్లో తలమునకలయ్యారు. ఆరిలోవలో ఉన్న పాత స్టేషన్‌ను అవుట్ పోస్టుగా నిర్వహిస్తున్నట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. అందులో నిత్యం కొందరు పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.